సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం : 20 : డిసెంబర్ : 2022

ఆ కందిపప్పు జీసీసీది కాదు



జీసీసీ గోదాంను తనిఖీ చేస్తున్న డీఎం పార్వతమ్మ

- పాడేరు జీసీసీ డీఎం పార్వతమ్మ

ముంచంగిపుట్టు: గిరిజనులు పట్టుకున్న కందిపప్పు జీసీసీది కాదని పాడేరు జీసీసీ డీఎం కురసా పార్వతమ్మ స్పష్టం చేశారు. జీసీసీ ఎండీ ఆదేశాల మేరకు ఆమె సోమవారం స్థానిక జీసీసీ గోదాంను తనిఖీ చేశారు. గోదాంలో రికార్డుల ప్రకారం ఉన్న 17,893 కిలోల కందిపప్పు బస్తాలను పరిశీలించి, లెక్క పెట్టారు. రికార్డులను పరిశీలించి, నిల్వ సరకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం గుర్రాలబైలు గ్రామస్తులు పట్టుకున్న కందిపప్పు జీసీసీది అనే అనుమానంతో గోదాంను తనిఖీ చేసినట్టు చెప్పారు. అంతా సక్రమంగా ఉన్నట్టు తెలిపారు. పట్టుకున్న కందిపప్పు జీసీసీకి సంబంధించింది కాదన్నారు. ఈ నెల కందిపప్పు ఆలస్యంగా రావడంతో ప్రస్తుతం డీఆర్ డిపోలకు కందిపప్పు పంపిణీ చేయలేదన్నారు. 32 అంగన్‌వాడీ సెంటర్లకు పంపిణీ చేయడం కోసం దగ్గరలో ఉన్న డీఆర్ డిపోలకు 20క్వింటాల 9కిలోల కందిపప్పు సరఫరా చేసినట్టు చెప్పారు. గిరిజనులు పట్టుకున్న కందిపప్పు ఎక్కడిది అనే విషయమై విచారణ జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్.మోహన్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాఫీ గింజల సేకరణ, రోజువారీ కూలి రేట్ల పెంపు



సంతోషం వ్యక్తం చేస్తున్న కూలీలు

పాడేరు రూరల్ : ఏపీఎఫ్‌డీసీకి చెందిన కాఫీ ఎస్టేట్స్‌లో పనిచేస్తున్న రోజువారీ కార్మికుల కూలి రేట్లతో పాటు కాఫీ గింజల సేకరణ రేట్లు పెంచారు. ఈ మేరకు ఏపీఎఫ్‌డీసీ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కూలి గిట్టుబాటు కావడం లేదని కార్మికులు పలు మార్లు ఏపీఎఫ్‌డీసీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఇంతవరకు కిలో కాఫీ గింజల సేకరణకు రూ.5.19, రోజువారీ కూలిరేటు రూ.273 చెల్లిస్తున్నారు. తాజాగా పెంచిన రేటు ప్రకారం కిలో కాఫీ గింజల సేకరణకు రూ.5.60 చెల్లించనున్నారు. రోజువారీ కూలి రేటు రూ.299.14కు పెంచారు. ఈ పెంపుతో కాఫీ కార్మికుల రోజువారీ వేతనంలో రూ.26.14, కిలో గింజల సేకరణలో 41 పైసలు అదనంగా పెరిగింది. పాడేరు ఐటీడీఏ పరిధిలోని పాడేరు, చింతపల్లి, ఆర్వీనగర్ డివిజన్లలో సుమారు 3వేల మంది కార్మికులు ఈ కాఫీ పళ్ల సేకరణపై ఆధారపడి జీవిస్తున్నారు. కూలి రేట్ల పెంపుతో కాఫీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్జీలపై సానుకూల స్పందన

- జేసీ శివశ్రీనివాస్



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రంపచోడవరం: స్పందనలో స్వీకరించిన అర్జీలపై అధికారులు సానుకూలంగా స్పందించి, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ శివశ్రీనివాస్ సూచించారు. రంపచోడవరం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌లతో కలిసి 55 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలకు అక్కడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు. రంపచోడవరం మండలం జాగరంపల్లిలోని ఆర్ అండ్‌ఆర్ కొత్తకాలనీలో వారం రోజుల నుంచి మంచినీటి సరఫరా నిలిచిపోయిందని కె.రాజన్నదొర, బందం సూరన్నదొరలు ఫిర్యాదు చేశారు. యార్లమామిడి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. చిలకమామిడి గ్రామంలో తొమ్మిది మందికి ఇళ్లు మంజూరు చేసిందని, వాటికి ప్రభుత్వం పరంగా వచ్చే నగదు, బ్యాంకు లోన్ రూ.50 వేలు అందజేయాలని బుడమల వెంకటలక్ష్మి, రమేష్‌లు కోరారు. వేములకొండ నుంచి తున్నూరు, చెలకవీధి నుంచి వెట్టి చెలకలు, కాకవాడ నుంచి వేములకొండ, డొకులపాడు గ్రామాలకు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. కాకవాడ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని సమస్యను త్వరగా పరిష్కారించాలని గిరిజనులు కోరారు. దేవీపట్నం మండలం పెద్దభీంపల్లి -2 ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కిరాణా దుకాణం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ముర్ల సూర్యవతి అర్జీ అందజేశారు. స్పందన కార్యక్రమంలో అధికారులు కోటేశ్వరరావు, జాన్‌విల్సన్, అనూష, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే డీసీసీబీ లక్ష్యం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ అనిత, తదితరులు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యంగా కొత్తఏడాదిలో పని చేస్తామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) చైర్‌పర్సన్ చింతకాయల అనిత తెలిపారు. సోమవారం విశాఖనగరంలోని మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని డీసీసీబీ కేంద్ర కార్యాలయంలో 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా అనిత మాట్లాడుతూ బ్యాంకు వ్యాపారలావాదేవీలురూ.2వేల కోట్లు దాటేలా పనిచేస్తామన్నారు. రుణాల మంజూరు సులభతరం చేసేందుకు అధికార వికేంద్రీకరణ చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల రైతు లు సకాలంలో రుణాలు పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులయూనియన్‌క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

లంబసింగి అందాలు అద్భుతం



బోటు షికారు చేస్తున్న జడ్జి దేవానంద్



జలాశయం వద్ద ఫొటో తీసుకుంటున్న జడ్జి కుటుంబ సభ్యులు

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్‌గా కీర్తిగాంచిన లంబసింగి అందాలు అద్భుతంగా ఉన్నాయని హైకోర్టు జడ్జి జస్టిస్ దేవానంద్ అన్నారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మండలంలో పలు ప్రాంతాలను సందర్శించారు. లంబసింగి అందాలను చూసి పరవశించిపోయారు. తాజంగి రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. కుటుంబ సభ్యులు జిప్‌లైన్ ఎక్కి ఆనందించారు. గిరిజనులు ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న స్ట్రాబెర్రీ తోటలను పరిశీలించారు. ఫొటోలు దిగి ఆనందంగా గడిపారు. పర్యాటకంగా లంబసింగి ప్రాంతం ఎంతో అద్భుతంగా ఉందన్నారు. ఎత్తయిన కొండలు, స్వచ్ఛమైన గాలి, చల్లని వాతావరణం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయన్నారు. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. రాత్రి ఇక్కడే బస చేసి మంగళవారం ఉదయం లంబసింగి మంచు అందాలు, చెరువులవేనం కొండల్లోని పాలసంద్రాలను తలపించే మంచు మేఘాల అందాలు వీక్షించనున్నారు. ఆయన వెంట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రెడ్డిప్రసన్న తదితరులు ఉన్నారు.

మత్స్యగుండంలో ధ్వజస్తంభానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ శాంతా కుమారి, ఆలయ కమిటీ సభ్యులు

హుకుంపేట: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మత్స్యగుండం మత్స్యలింగేశ్వర ఆలయం వద్ద నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు సోమవారం స్థానిక సర్పంచ్ మఠం శాంతాకుమారి,ఆలయ కమిటీ పెద్దలు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతకుమారి మాట్లాడుతూ మహాశివ రాత్రి పర్వదినం దగ్గర పడుతున్న నేపథ్యంలో పండగ ఏర్పాట్లు ముందుగానే అధికారులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ పెద్దలు సింహాచలం,రామలింగం, కేశవరరావు,చినరామ్‌నాయుడు,మత్స్యకొండబాబు,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణం

- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం



రోడ్లపై చెత్త తొలగించే పనులను జెండాను ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పి.గొందూరు సమీపంలోని మెట్టబంగళా వద్ద రోడ్డు పరిసరాలను డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించే కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడేరు నుంచి గరికిబంద,అరకు నుంచి చిలకలగెడ్డ, పాడేరు నుంచి జి.మాడుగుల మధ్య రోడ్డుకు ఇరువైపులా చెత్తను తొలగించేందుకు క్లీన్‌డ్రైవ్‌ను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలన్నారు.15 రోజుల్లో ఈ రోడ్లలో పనులను పూర్తిచేసి, తర్వాత మిగిలిన ప్రాంతాల్లో క్లీన్ డ్రైవ్‌ను విస్తరించేందుకు కార్యాచరణ చేపట్టాలని డీఎఫ్‌వో వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ క్లీన్‌డ్రైవ్‌కు 47మంది గిరిజన నిరుద్యోగులను గుర్తించి,ఉపాధి కల్పించాలని చెప్పారు. రోజుకు రూ.500 వేతనం చెల్లించాలని కలెక్టర్ సూచించారు. ప్రతీ రెండు కిలోమీటర్లకు ఒక డంపర్ బిన్ ఏర్పాటు చేయాలని, వాటిని ఎంపీడీవో అందుబాటులో ఉంచాలన్నారు. పాడేరు పట్టణంలో ప్రతీ దుకాణదారుడు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకునేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి, వీలైనన్ని పండ్ల,పూల,కలపజాతుల మొక్కలు నాటేందుకు అటవీశాఖ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు రక్తదాన శిబిరాలు ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయినవీన్,అటవీశాఖ రేంజ్ అధికారులు, ఎఫ్ఆర్‌వోలు, బీట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

- ఇద్దరు ఉపాధ్యాయులకు ఒకరోజు జీతం నిలుపుదల



రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : ఇద్దరు ఉపాధ్యాయులకు ఒకరోజు జీతం నిలుపుదల చేయడంతో పాటు హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన మండలంలోని మలకపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎస్జీటీ ఉపాధ్యాయులు జి.సిద్ధేశ్వరరావు, డి.సూరిబాబు విధులకు హాజరుకాలేదని గుర్తించి ఒకరోజు జీతం నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రతీ రోజు అప్రూవల్ చేయడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శంకర్‌రావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పాఠశాలలో మొత్తం 147 మంది విద్యార్థులకు గాను 112 మంది మాత్రమే హాజరు కావడంతో డ్రాపౌట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. టెన్త్ విద్యార్థులకు తెలుగు వ్యాకరణం బోధించి, విద్యా ప్రమాణాలపై పరిశీలించారు. లెర్నింగ్ మెటీరియల్ సక్రమంగా రూపొందించడం లేదని గ్రహించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలో ఉన్న వాటర్ హీటర్, కూలర్‌లను మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలన్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన వంట్లమామిడి, ఐనాడ, దేవాపురం గ్రామ సచివాలయాలను సందర్శించారు.

ఓటర్ల పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి



అధికారులతో వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు,చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈనెల 22వ తేదీ లోగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 5న ఓటర్ల జాబితా తుది ప్రచురణ ఉన్నందున పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి,తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతీ క్లెయిమ్‌తో పాటు ఫారం 7,8,9లు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఓటర్ల జాబితాల తయారీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, బీఎల్‌వోలు సహకరించని పక్షంలో నిబంధనలు ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ జిల్లాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయని తహసీల్దార్‌లు, బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఇంజినీరింగ్ సహాయకులు సహకరించడం లేదని డుంబ్రిగుడ తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్‌లు కూడా సహాయ ఎన్నికల అధికారులని, వారికి సహకరించని పక్షంలో చర్యలు తప్పవని ఇంజినీరింగ్ సహాయకులను కలెక్టర్ హెచ్చరించారు. వీఆర్‌ఏలను ఎన్నికల విధులకు ఉపయోగించవద్దని,వారి స్థానంలో వేరేవారిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా నివేదికలు సిద్ధంగా ఉంచాలని, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వెనుకబడిన మండలాలపై ఐటీడీఏ పీవోలు దృష్టిసారించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.దయానిధి పాల్గొన్నారు.

పెళ్లింట పెను విషాదం

- ఉరి వేసుకొని కొత్త పెళ్లి కొడుకు మృతి
- అనుమానాస్పద మరణంగా కేసు నమోదు



మృతదేహం(ఇన్‌సెట్) నాగభూషణం (ఫైల్)

రాజవొమ్మంగి: వివాహ సందడి ఇంకా ముగియలేదు. పెళ్లికి వచ్చిన బంధువులు, స్నేహితులు ఇంకా వారి ఇళ్లకు చేరుకోలేదు. అంతలోనే ఆ ఇంట పెనువిషాదం నెలకొంది. ఏం కష్టం వచ్చిందో గాని వివాహం జరిగి మూడు రోజులు గడవకుండానే పెళ్లి కొడుకు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న హృదయవిదారక సంఘటన రాజవొమ్మంగి మండలం బోర్నగూడెంలో సోమవారం జరిగింది. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ అందజేసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలెం నాగభూషణం (30) అదే గ్రామంలో ఇంటికి కొంత దూరంలో ఏటిగట్టుపై ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని మరణించాడు. గ్రామస్తులు కొంత మంది చూసి మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. ఈనెల 17న మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన ఓ యువతిని పెద్దల నిశ్చయం ప్రకారం ఓ ఆలయంలో నాగభూషణం వివాహం చేసుకున్నాడు. సోమవారం బహిర్భూమికి వెళ్లి వస్తానని భార్యకు చెప్పి ఎదురుగా ఉన్న కాలువవైపు వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పెళ్లి కుమారుడు పెద్ద తండ్రి దాసరి ఏసుబాబు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని స్థానిక సీఐ రవికుమార్ సందర్శించి, ఆరా తీశా రు. వీఆర్వో నాగేశ్వరరావు తదితరుల సమక్షంలో పంచనామా నిర్వహించారు.

ఆల్ ఇండియా ఆర్చరీ పోటీలకు దినేష్



ఆర్చరీ పోటీలకు ఎంపికైన దినేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్,వైస్ ప్రిన్సిపాల్

అరకులోయ: పంజాబ్‌లోని గురుకాశీ విశ్వవిద్యాలయంలో ఈనెల 23వ తేదీ నుంచి జరిగే ఆల్ ఇండియా ఆర్చరీ పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎస్.దినేష్ ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలకు దినేష్ ఎంపికకావడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పద్మకుమారి,స్పోర్ట్స్ ఇన్‌చార్జి పి.నాగబాబు,పీడీ అప్పారావు,అధ్యాపకులు,తోటి విద్యార్థులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఈపోటీల్లో దినేష్ ప్రథమ స్థానం సాధించాలని ఆకాంక్షించారు.

రేపు పాడేరులో ఎలక్టోరల్ అబ్జర్వర్ పర్యటన

పాడేరు రూరల్ : ఎలక్టోరల్ అబ్జర్వర్ బాబు ఈనెల 21న పాడేరులో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం విశాఖపట్నంలో బయలుదేరి 10గంటలకు పాడేరు చేరుకుంటారని, 10.30 గంటల నుంచి 11.15 గంటల వరకు కలెక్టర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎలక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. 11.15 గంటల నుంచి 11.30 గంటల వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర వ్యక్తుల నుంచి ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు పలు కేంద్రాలను పరిశీలిస్తారని చెప్పారు.

ప్రతీ గ్రామానికి రోడ్డు సదుపాయం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- గిన్నెలకోట గెడ్డపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



వంతెన నిర్మాణ శిలా ఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



గెడ్డదాటి వెళుతున్న ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు

పెదబయలు: ప్రతీ గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గిన్నెలకోట పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణకు వచ్చిన ఆయన ఎస్‌సీఏ గ్రాంట్ రూ.1.40 కోట్లతో మంజూరైన వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినా చూడని అభివృద్ధి కేవలం మూడేళ్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతోందని చెప్పారు. మరో మూడు నెలల్లో వంతెన కల తీరబోతోందని చెప్పారు. రూడకోట నుంచి జామిగుడ వరకు రోడ్డు నిర్మాణానికి, జామిగుడ నుంచి గుంజివాడకు వెళ్లే మార్గంలో గెడ్డపై రూ.2 కోట్లతో వంతెన ఏర్పాటుకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. జంగంపుట్టు నుంచి ఇంజరి మీదుగా కోంద్రుం వరకు రోడ్డు, బంట్రోతుపుట్టు నుంచి కుంతుర్ల వరకు తారురోడ్డు నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయని, గత ప్రభుత్వ పాలకులు ఈ పంచాయతీ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవన్నారు.

పర్యాటకంగా అభివృద్ధి : గిన్నెలకోట వంతెన నిర్మాణం పూర్తయితే ఇదే పంచాయతీకి చెందిన పిట్టలబొర్ర, ఇనుపతీగల జలపాతాలు పర్యాటకం ప్రాంతాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. తద్వారా పంచాయతీలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, ఎంపీపీ వరహాలమ్మ, సర్పంచ్ చిన్నతల్లమ్మ, ఎంపీటీసీ నిర్మల,మాజీ జెడ్పీటీసీలు కొంటా సూర్యనారాయణ,జర్సింగి గంగాభవాని,మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు,సర్పంచ్ మత్స్యరాజు,మాజీ సర్పంచులు రామన్నపడాల్,చిన్నారావు,నాయకులు జర్సింగి బాలంనాయుడు,గంపరాయి సూరయ్య, కనకరాజు,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో ఆర్‌ఐఎన్‌ఎల్ ఎంఓయూ



వీసీ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్) అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విశాఖ స్టీల్‌ప్లాంట్ సీజీఎం(హెచ్‌ఆర్)-కార్పొరేట్ సర్వీసెస్ జి.గాంధీలు సంతకాలు చేశారు. విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయం సమన్వయంలో భాగంగా పరిశోధన, ప్రాజెక్టుల నిర్వహణ, సర్వేలు ఉమ్మడి సహకారంతో కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఏయూ ఆచార్యులు, డీన్‌లు, ఆర్ఐఎన్ఎల్ హెచ్‌ఆర్‌డి విభాగం అధికారులు పాల్గొన్నారు.

క్రీడోత్సాహం



తాజంగిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



గిన్నెలకోటలో వాలీబాల్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అడ్డతీగలలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా జిల్లాలోని పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లోని చింతపల్లి, పెదబయలు, అడ్డతీగల మండలాల్లో క్రీడా పోటీలను ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మిలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– 8లో

క్రీడలతో మానసిక ఉల్లాసం


విలేకరులతో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు

అడ్డతీగల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తూ అన్ని వర్గాల మన్ననలు అందుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని క్రీడలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 20న మొక్కలు నాటే కార్యక్రమం, 21న రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, మళ్లీ ఆయనను ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు మద్దతు తెలియజేయాలని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, వైస్ ఎంపీపీ కరణం వీరవెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు నక్కా ఈశ్వరి, వట్లమూరి రత్నం, సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

చింతపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలోని తాజంగిలో వాలీబాల్ పోటీలను సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబర్చాలని సూచించారు. విజేతల జట్లకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండవ బహుమతిగా రూ.10 వేలుతో పాటు వాలీబాల్ కిట్లు అందజేస్తామని తెలిపారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రవి, మాజీ ఎంపీటీసీ అంగధరావు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గిన్నెలకోట పంచాయతీ కేంద్రంలో వాలీబాల్ టోర్నీని నిర్వహించారు. పోటీలను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, దీంతో మంచి ఆరోగ్యం లభిస్తోందన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న 15 వాలీబాల్ జట్లకు వాలీబాల్, నెట్లను పంపిణీ చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రైతుల ఇంట.. సిరుల పంట

- చిరు ధాన్యాల సాగు అదరహో
- ఆశించిన స్థాయిలో పంటల దిగుబడులు
- ఆనందంలో గిరిజన రైతులు


పోడుభూముల్లో చోడి పంట


సామ పంట


మైదాన ప్రాంతానికి రవాణా చేసేందుకు సిద్ధం చేసిన సామల బస్తాలు

జి.మాడుగుల: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత పోడు భూముల్లో ఆదివాసీ గిరిజన రైతులు ఈ ఏడాది ఆశించిన స్థాయిలో చిరు ధాన్యాలైన రాగులు(చోళ్లు), సామలు పంటలు దిగుబడులు సాధించారు. వాతావరణం అనుకూలించడంతో పాటు ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు భరోసా పథకం తోడుకావడంతో రైతుల ఇంట సిరులపంటైంది. గిరిజన గ్రామాలకు ఆనుకొని ఉన్న పోడు, అరుతడి వ్యవసాయ భూముల్లో ఆయా పంటలు సాగు వేశారు. చిరుధాన్యాలకు గిరాకీ ఉండడంతో మన్యంలో ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో ఏజెన్సీలో పండించే సామలు, రాగులు, కొర్రలు, సజ్జలు తదితర చిరుధాన్యాలకు ధరలు బాగుండడంతో రైతులు పోడు భూముల్లో సాగు చేస్తున్నారు. పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీంతో మండలంలో అనేక గ్రామాల్లో ఆదివాసీ గిరిజన రైతులు ఈ సంవత్సరం రాగులు, సామలు, కొర్రలు వంటి చిరు ధాన్యాల పంటలు ప్రధానంగా దృష్టి సారించారు.గిరిజన రైతులు వరి పంటతోపాటు మిగతా భూముల్లో కూడా రాగులు, సామలు వంటి పంటల పట్ల ఆసక్తి కనబర్చి సాగు విస్తీర్ణం పెంచారు. అల్లూరి జిల్లాలో 16,910హెక్టార్లు, సామలు–4,529 హెక్టార్లు కాగా ఇందులో, జి.మాడుగుల మండలంలో రాగులు–2286.89ఎకరాలు, సామలు–147.72 ఎకరాల్లో దిగుబడులు సాధించారు. రాగులు, సామలు దిగుబడుల తగ్గట్లుగా వారపు సంతల్లో ప్రారంభ ధరలు రాగులు కిలో రూ.20 నుంచి రూ.25, సామలు కిలో రూ.30 నుంచి రూ.35 పలుకుతున్నాయి. రాగులు, సామలు రానురాను వారపు సంతల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. రాగులు, సామలు దిగుబడులుతో పాటు ధరలు ఉండటంతో ఆదివాసీ గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడులు బాగున్నాయి

మండలంలో పలు చోట్ల వరి, రాజ్‌మా పంటలతో పాటు చిరుధాన్యాల వ్యవసాయ పంటలను పరిశీలించాం.ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు పడ్డాయి.అన్ని పంటలు బాగున్నాయి. వ్యవసాయ అధికార యంత్రాంగం సూచనలు, సలహాలు పాటించి గిరిజన రైతులు పంటల దిగుబడులు సాధించారు.

– **ఎల్.ఆర్.బి.పాత్రుడు**, ఏవో, జి.మాడుగుల

ఆశాజనకంగా లాభాలు

ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించడంతో పంటల దిగుబడులు సాధించాం.వారపు సంతల్లో రాగులు, సామలు ప్రారంభ ధరలు బాగున్నాయి.ఆశించిన లాభాలు వస్తున్నాయి. పంటలో కొంత భాగం తమ అవసరాలను ఉంచుకొని, మిగతా దినుసులకు, వారపుసంతకు తరలించి విక్రయిస్తున్నాం.

– **సుబ్బారావు**, రైతు, ఎస్.పెదబయలు గ్రామం, జి.మాడుగుల మండలం

వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి

కొయ్యూరు (?) కోట: తాళ్లపాలెం కూడలి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. అచ్చెర్ల గ్రామానికి చెందిన గాజులూరి తాతబ్బాయి (60) తాళ్లపాలెం వద్ద టీ తాగడానికి అవతల ఉన్న హోటల్‌కు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న వ్యాన్ ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అప్పలారస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించినట్టు ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. మృతునికి భార్య, పెళ్లయిన కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. రజకవృత్తిసాగిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తాతబ్బాయి గాజువాకలో ఉన్న తన చిన్న కుమార్తెను చూసి రావడం కోసం బయలుదేరి ప్రమాదానికి గురై మృత్యువాత పడటంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

పాత కక్షలతో దాడి.. ఒకరి మృతి

జి.మాడుగుల : ఇద్దరు గిరిజనులు గొడవ పడిన సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన కొర్రా నాగేశ్వరరావు అదే గ్రామానికి చెందిన గెమ్మెలి దొరబాబుకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. నాగేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం పూటుగా మద్యం సేవించి దొరబాబుపై దాడి చేసి పైకెత్తి దగ్గరలో ఉన్న సీసీ ర్యాంపుపై పడేశాడు. దీంతో దొరబాబు తలకు తీవ్రగాయమయ్యింది. గాయపడిన దొరబాబును గ్రామంలో కొంతమంది జి.మాడుగుల పీహెచ్‌సీ తరలించగా ప్రథమ చికిత్స చేసి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. దొరబాబు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

180 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


గంజాయితో పట్టుబడిన నిందితులు

రోలుగుంట : మండలంలో అక్రమంగా గంజాయి రవాణా జరుగుతుందన్న సమాచారంతో ఎస్‌ఐ బి.నాగకార్తీక్ సిబ్బందితో కలసి కె.నాయుడుపాలెం–గుర్రంపేట మార్గం మాటు వేసి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలింపు కోసం వినియోగించిన ఒక బలేరా వ్యాన్‌ను, ఒక మోటార్ బైకును, 180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకునట్టు ఎస్‌ఐ సోమవారం రాత్రి విలేకరులకు తెలిపారు. పట్టుబడిన వారిలో ఒక మైనర్ (జువినల్) ఉన్నారన్నారు.

చెయిన్ స్నాచర్‌ను పోలీసులకు అప్పగించిన జనం

అనకాపల్లిటౌన్ : మహిళ మెడ నుంచి 4 తులాల బంగారు పుస్తెలతాడు యువకుడు తెంచుకుపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలో గోపాలపురానికి చెందిన జెత్రిపోతుల రమణమ్మ తన స్వగ్రామం నుంచి మునగపాక మండలం తిమ్మరాజుపేటలో బంధువుల ఇంటికి తన కుటుంబసభ్యులతో కలిసి వెళ్లింది. తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు అనకాపల్లి పట్టణానికి చేరుకుంది. స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద ఆటో ఎక్కుతుండగా ఓ యువకుడు ఆమె మెడ నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిపోయాడు. దీంతో ఆమె బిగ్గరగా అరవడంతో చుట్టుపక్కల వారు యువకుని వెంట పరుగు తీశారు. ఉడ్‌పేట ప్రాంతం వెంబడి పరుగు తీస్తున్న యువకుడ్ని స్థానికులు పట్టుకున్నారు. అటుగా వెళ్తున్న బ్లూకోట్స్ –1కు అతడిని అప్పగించారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన గిరిజనుడు


రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ రాంప్రసాద్ నుంచి సిల్వర్ మెడల్ అందుకుంటున్న ప్రసాద్

ముంచంగిపుట్టు: మండలంలో గల పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన గిరిజనుడు కుర్తాడి ప్రసాద్ విశాఖలో జరిగిన అథ్లెటిక్స్‌లో మెరిశాడు. ఈ నెల 16, 17వ తేదీల్లో నెల్లూరు జిల్లా ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన 41వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ చాంపియన్‌షిప్–2022 పరుగు పందెం పోటీలకు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పాల్గొన్న కుర్తాడి ప్రసాద్ సత్తా చాటాడు. 1500 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించారు. రిలే 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించాడు. ప్రసాద్‌కు సిల్వర్ మెడల్‌లతో పాటు సర్టిఫికెట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ రాంప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. దీనికి తోడు 2023 సంవత్సరం ఫిబ్రవరి 14 నుంచి 19 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగే జాతీయ క్రీడా పోటీలకు గిరిజనుడు కుర్తాడి ప్రసాద్ ఎంపిక అయ్యాడు. రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్స్‌ను సాధించి మండలానికి మంచి పేరు తీసుకువచ్చిన ప్రసాద్‌కు మండల వాసులు అభినందించారు.

ఆర్థిక సాయం కోసం వినతి

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో పోటీల్లో పాల్గొనేందుకు సతమవుతున్నానని క్రీడాకారుడు కుర్తాడి ప్రసాద్ చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే సత్తా, కఠోర శ్రమ ఉన్న పేద కుటుంబంతో ఆర్థిక చేయూత లేక వెనకడుగు వేస్తున్నానని, ఐటీడీఏ ద్వారా లేక దాతలు ఎవరైన ఆర్థిక చేయూత అందిస్తే మిదానపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటి గిరిజన ప్రాంతానికి మంచి పేరు తీసుకువస్తానని అథ్లెటిక్ క్రీడాకారుడు కుర్తాడి ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి

బుచ్చెయ్యపేట : కేపీ అగ్రహారం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గున్నెంపూడికి చెందిన తాపీమేస్త్రి బత్తుల నారాయణమూర్తి (55) మృతి చెందాడు. కొండెంపూడిలో ఇంటి నిర్మాణ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కేపీ అగ్రహారం నూకాలతల్లి గుడి దగ్గరలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. నారాయణమూర్తికి భార్య నాగమణి, కుమారుడు మోషా ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వారపు సంతలో సీఆర్‌పీఎఫ్ సేవలు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో బాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి వారపు సంతకు వచ్చిన సుమారు 170 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లను అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, సిబ్బంది పంపిణీ చేశారు.

రేపటి నుంచి ఉచిత బియ్యం పంపిణీ

పాడేరు రూరల్: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నా యోజన పథకం కింద ఈనెల 21 నుంచి పీఎంజీకేవై కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నట్టు జేసీ శివ శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిత్యావసర సరకులకు తుది గడువు నేడు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరకులైన బియ్యం, కందిపప్పు, పంచదార పొందడానికి ఈనెల 20న తుది గడువు అని జేసీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల కార్డుదారులందరూ సరకులను పొందాలన్నారు.

21న 'వినియోగదారుల' సమావేశం

జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈనెల 21న వినియోగదారుల వ్యవహారాల సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్టు జేసీ తెలిపారు. 'వినియోగదారు కమిషన్‌లలో కేసులను సమర్థంగా పరిష్కరించడం' అనే అంశంపై చర్చ నిర్వహిస్తామన్నారు.

వాహన తనిఖీలు

వై.రామవరం: మండల కేంద్రంలో ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్‌లు, వాహనపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందితోపాటు సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంలో స్వచ్ఛభారత్


కొత్తపల్లి జలపాతం వద్ద పరిసరాలను శుభ్రపరుస్తున్న గిరిజన మహిళలు

జి.మాడుగుల: గ్రామాలు, పర్యాటక ప్రాంతాల్లోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ నిషేధించాలని ఎంపీడీవో లోహిత్ జయసాగర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో కొత్తపల్లి పర్యాటక ప్రాంతంలో సోమవారం పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కొత్తపల్లి గ్రామ సమీపంలోని జలపాతం ప్రాంత పరిసరాలను గ్రామస్తులు, కమిటీ సభ్యులు కలసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. జలపాత ప్రాంతాల్లో ఉన్న దుకాణాలు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్‌ను వినియోగించొద్దన్నారు. కొత్తపల్లి జలపాతాల పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జలపాతం మేనేజర్ నవీన్, సూపర్‌వైజర్ అభి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

దేశ సేవలో భాగస్వాములు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్

సాక్షి, పాడేరు: యువత దేశ సేవలో భాగస్వామ్యం కావాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రంలో సభ్యత్వ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు ముందుకు రావాలన్నారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ కూడా నెహ్రూ యువ కేంద్రం ద్వారా విద్యార్థులకు వివిధ సంస్కృతులపై అవగాహన కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.పద్మలత, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోలు విజయలక్ష్మి, నాగబాబు, కో–ఆర్డినేటర్ పి.కొండబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధనలక్ష్మి ఔదార్యం


బాలుడు సన్యాసిరావును అక్కున చేర్చుకొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: తల్లిదండ్రులు లేక తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ గిరిజన బాలుడి ఆరోగ్య సమస్యను గమనించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అక్కున చేర్చుకొని నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. రాజవొమ్మంగి మండలం ఉర్లాకులపాడు పంచాయతీ కోసూరివారివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గ్రామానికి చెందిన తమదాల సన్యాసిరావు (8) అనే బాలుడు వింత సమస్యతో బాధపడుతు కనుపించాడు. బాలుడు స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. చిన్నారి శిరస్సు రోజు రోజుకు పెరుగుతోందని స్థానికులు తెలిపారు. ఆ బాలుని దీనస్థితిని గమనించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి వెంటనే బాలుడు చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలుని ఆరోగ్యం కుదుట పడేందుకు తన వంతు సహాయం అందజేస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. సదరం క్యాంపులో స్లాట్‌బుక్ చేసి దివ్యాంగ సర్టిఫికేట్ పొందేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉర్లాకులపాడు గ్రామానికి చెందిన కోన లీలావర్థన్‌కు పుట్టుక నుంచి ఒక కన్ను లేదని తల్లిదండ్రులు తెలియజేయడంతో ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆ బాబుకు అవసరమైన చికిత్స అందజేస్తామని హామీ ఇచ్చారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు

- డ్వామా పీడీ రమేష్‌రామన్

అరకులోయ రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పీడీ రమేష్ రామన్ పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 2021–2022 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన పనులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా వేసిన మొక్కలు కేవలం 50 శాతం నుంచి 70 శాతం వరకు మాత్రే పెరిగాయని, వెంటనే మరో 30 శాతం మొక్కలు కూడా పెంచాలని ఆదేశించారు ఉపాధి కార్డులు ఉన్న కూలీలకు ప్రతి రోజు రూ.257 కూలీ చెల్లించాలని ఆదేశించారు. పని ప్రదేశంతో సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని అలాగే పని ప్రదేశంలో నీడ, ప్రథమ చికిత్స కిట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి చిన్నయ్యదొర, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మల దేవి, ఎంపీపీ ఉషారాణి ,వైస్ ఎంపీపీ రామన్న,జెడ్పీటీసీ శెట్టి రోషిణి తదితరులు పాల్గొన్నారు.